జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


కమిషనర్ ఇలంబర్తితో ఆదిల్ షరీఫ్, జనక్‌ప్రసాద్, ఆర్‌డీలు

అబిడ్స్: జీహెచ్ఎంసీ ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలతో పాటు హెల్త్ కార్డుల జారీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ కోరారు. ఈమేరకు యూనియన్ ప్రతినిధులతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో రహస్య బ్యాలెట్ పద్ధతి ప్రవేశపెట్టాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని పేర్కొన్నారు. కలిసినవారిలో కనీస వేతనాల బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ అనుబంధ విభాగం ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ యాదవ్, భాస్కర్‌రెడ్డి, కె.శివకుమార్ కలిశారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్


వాహనాలను సీజ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గోల్కొండ: టూమ్స్ చౌరస్తా, టోలిచౌకీ, పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలను సీజ్ చేసి టోలిచౌకీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్ మాట్లాడుతూ.. టోలిచౌకీ పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో వాహనాల సంఖ్య బాగా పెరిగిందని, అక్రమ పార్కింగ్‌ల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

తప్పుల తడకగా కులగణన సర్వే


మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో కులగణన సర్వే తప్పుల తడకగా జరిగిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ పేర్కొన్నారు. గుడిమల్కాపూర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో మండలాలు, గ్రామాల్లో అసలు కులగణన సర్వే జరగలేదన్నారు. జనాభాలో బీసీల వివరాలు, వారి శాతాన్ని సరిగా చూపిస్తే బీసీలందరూ ఐక్యమై అగ్ర కులస్తుల ఆధిపత్యానికి గండి కొడుతారన్నా భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి కులగణనపై తప్పుడు లెక్కలు చెప్పారని మండిపడ్డారు. కార్యక్రమంలో నామా యాదగిరి నేత, సాగర్, ముత్యాల బలరామ్, రాజుసాగర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన


డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: రెయిన్‌బజార్ డివిజన్‌లోని ఈస్ట్ చంద్రానగర్, మదీనానగర్, యాకుత్‌పురా ప్రాంతాల్లో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి డ్రైనేజీ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగల సమస్యల పరిష్కారానికి కృషి



సుల్తాన్‌బజార్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి టీఎన్జీఓస్ యూనిట్ అధ్యక్షుడు తూంకుంట రాజు నేతృత్వంలో బుధవారం వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా అవకాశం కల్పించిన టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్ హుస్సేనీ, కేంద్ర, జిల్లా సంఘం సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్కింగ్ పరేషాన్..!

- పాతబస్తీలో నిర్దేశిత స్థలాల కరువు
- ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత
- రాకపోకలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు


మక్కా మసీద్ రోడ్డులోని ప్యారిస్ కేఫ్ చౌరస్తా వద్ద ఇష్టారాజ్యంగా నిలిపిన ఆటోలు

చార్మినార్: పాతబస్తీలో వాహనాల పార్కింగ్‌కు నిర్దేశిత స్థలాలు లేకపోవడంతో అటు వాహనదారులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు..ఆపై ఎక్కడ పడితే అక్కడే పార్కింగ్ చేస్తుండడంతో సమస్య మరింత జఠిలం అవుతోంది. ప్రధాన కూడళ్లలో ఆటోలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తుండడంతో ఇతర వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు.

కానరాని నిర్దేశిత పార్కింగ్ స్థలాలు ..

పాతబస్తీలో ఇతర వాహనాలతో పాటు ఆటోలకు సరైన పార్కింగ్ స్థలాలు లేవు. ఆటోలపై ఆంక్షలు విధిస్తున్న సంబంధిత ట్రాఫిక్ పోలీసులు, వాటిని ఎక్కడ నిలపాలో మాత్రం చెప్పడం లేదని, ఇప్పటికైనా నిర్దేశిత పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

రద్దీగా చౌరస్తాలు..

గుల్జార్‌హౌజ్ చౌరస్తా, పంచ్‌మొహల్లా (ప్యారిస్ కేఫ్) చౌరస్తా, పురానాపూల్, బహదూర్‌పురా, కిషన్‌బాగ్, జూపార్కు, లాల్‌దర్వాజ మోడ్, శంషీర్‌గంజ్, చాంద్రాయణగుట్ట, సంతోష్ నగర్, ఐఎస్ సదన్‌లో అక్రమ పార్కింగ్‌లతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. నగరం నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలతో పాటు (మొఘల్‌పురా ఫైర్ సర్వీస్ స్టేషన్ నుంచి ముందుకు వచ్చే వాహనాలు) పంచ్‌మొహల్లా చౌరస్తా నుంచే వెళ్లాలి. ఇలాంటి కీలకమైన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. ఇక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది.

పర్యాటక ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు కేటాయించాలి..

పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలైన చార్మినార్, మక్కా మసీదు, సాలార్ జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూపార్కు తదితర ప్రాంతాల్లో పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలను కేటాయించాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. అలా కాకుండా ప్రయాణికులు లేని ప్రదేశంలో పార్కింగ్ ఏర్పాటు చేస్తే ఫలితం ఉండదని, అంతేగాకుండా తమ జీవనోపాధికి ఇబ్బందులు కలుగుతాయని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని వారు విన్నవిస్తున్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి


మానసిక దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసరాలు అందజేస్తున్న కేఎస్.కృష్ణ

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని సుప్రీంకోర్టు న్యాయవాది, లీగల్ ఇండియా ట్రస్ట్ చైర్మన్ కేఎస్.కృష్ణ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని సాధన ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటలెక్చువల్లి చాలెంజ్ సంస్థకు బుధవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి మానసిక వికలాంగులకు తమ ట్రస్ట్ తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సాధన సంస్థ వ్యవస్థాపకులు సురేఖ రెడ్డి మాట్లాడుతూ.. 150 మంది మానసిక దివ్యాంగ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వారికి సహకరించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది సీహెచ్ శ్రీధర్, డాక్టర్ వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటా


శ్రీనివాస్

నాంపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూ అండగా ఉంటానని టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కురాడి శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమితులు కాగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు సహకరించిన టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేన్‌కు ధన్యవాదాలు తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు పాటుపడుతానని తెలిపారు.

వర్సిటీకి ఉత్తమ ర్యాంక్ తీసుకురావాలి


మాట్లాడుతున్న వీసీ జానయ్య

ఏజీవర్సిటీ: ప్రతిభ, సమర్థనీయత, అనుభవాల ఆధారంగా ఏజీ వర్సిటీకి మంచి ర్యాంక్ తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జనాయ్య తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల పదోన్నతులు పొందిన అధికారులు, నూతనంగా వచ్చిన అధికారులతో పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశ్వవిద్యాలయ అధికారుల నియామకాన్ని ఒత్తిళ్ల ప్రలోభాలు లేకుండా పూర్తి చేసినట్లు వివరించారు. భవిష్యత్‌లో దేశంలోని అత్యుత్తమ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పీజేటీఏఎస్‌ను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సంక్షేమమే పరమావధిగా పనిచేయాలన్నారు. ఉపకులపతి సూచనలు, సలహాలతో విశ్వవిద్యాలయ స్థాయిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పదోన్నతి పొందిన అధికారులు సూచించారు.

లక్ష్మీగూడ వాంబే కాలనీలో కార్డన్ సెర్చ్


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి: శాంతిభద్రతలను కాపాడేందుకే కార్డన్ సెర్చ్‌లను చేపడుతున్నామని మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ వాంబే కాలనీలోని వైట్, పింక్ బిల్డింగ్ ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్న 8 దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. నివాస ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన నిందితుడిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టీఎన్‌జీవోస్ కాలనీలో కుక్కమల్ల ప్రకాష్‌కు ప్లాట్ నెంబర్ 517లో 300 గజాల స్థలం ఉందని ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. దీనిని గతంలో పవన్‌కుమార్ అనే వ్యక్తికి జీపీఏ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అప్పుడు ఈ స్థలం ఖాళీ ప్లాట్‌గా ఉండేదన్నారు. ఈ ప్లాట్‌ను సుభాష్, అశోక్ అగర్వాల్, సంజుదేవిలు ఫోర్జరీ చేసి డాక్యుమెంట్స్‌తో అక్రమించుకొని బిల్డింగ్ కట్టి ఉంటున్నారన్నారు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. 1999లో కుక్కమల్ల ప్రకాష్ చనిపోగా విషయం తెలుసుకున్న స్థానిక ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కొప్పుల అమరేశ్వర్‌గౌడ్ ఈ స్థలంపై కన్నేసి 2011వ సంవత్సరంలో తనకు తెలిసిన సుభాష్, శ్రీనివాస్, సయ్యద్ రఫీద్‌ఖాన్, నర్సింహారెడ్డిలతో కుమ్మక్కై ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫొటోను పెట్టి అమరేశ్వర్‌గౌడ్ ఫోర్జరీ సంతకం చేసి సుభాష్ అనే వ్యక్తి పేరు మీద జీపీఏ చేశాడన్నారు. ఆ తరువాత ప్లాట్‌ను వీరంతా కలిసి అశోక్ అగర్వాల్‌కు అమ్మినట్లు విచారణలో తేలిందన్నారు. గత నెల 28వ తేదీన శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా అతడిని 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. బుధవారం కొప్పుల అమరేశ్వర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ నరేందర్ వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ కిషన్‌నగర్, ఆసిఫ్‌నగర్ ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హుడాకాలనీ, జిర్రా రోడ్, గంజాషా దర్గా, ద్రౌపతి గార్డెన్, ఫ్రెండ్స్ కేఫ్, మాంగార్ బస్తీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి

అఫ్జల్‌గంజ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని సినీ నటుడు, బీజేపీ మైనార్టీ మోర్చా కోశాధికారి షేక్ రహ్మతుల్లా అన్నారు. ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయ టెక్వాన్ పోటీల విజేతలను అఫ్జల్‌గంజ్‌లోని తన కార్యాలయంలో బుధవారం సన్మానించారు.

8న చెస్ పోటీలు

చార్మినార్: ఈనెల 8న డాక్టర్ మన్మోహన్ సింగ్ మెమోరియల్ అండర్-16 స్కూల్ చెస్ టోర్నమెంట్-2025 నిర్వహించనున్నామని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తెలిపారు. పాల్గొనే విద్యార్థులు 7 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విజేతలకు అదేరోజు రాత్రి 7 గంటలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ ప్రారంభించనున్నారని, తొమ్మిది రౌండ్లలో స్విస్ ఫార్మెట్‌లో ఉంటాయన్నారు. 2009 జనవరి 1 అనంతరం జన్మించిన బాల బాలికలు పోటీలకు అర్హులని, మరిన్ని వివరాలకు 8500212306 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

9 నుంచి ఇన్సూరెన్స్ వర్కర్స్ అఖిల భారత సమావేశం

చార్మినార్: నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ 19వ అఖిల భారత త్రైవార్షిక సమావేశం ఈనెల 9,10 న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో నిర్వహించనున్నట్లు ఇన్సూరెన్స్ వర్కర్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శీరా రాజ్‌కుమార్ తెలిపారు. పాతబస్తీ లాల్‌దర్వాజలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 1200 మంది ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో క్లాస్-3,క్లాస్-4 ఉద్యోగుల తక్షణ నియామకంతో పాటు 1996 బ్యాచ్ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం వర్తింప చేయడం, తాత్కాలిక రోజు వారి ఉద్యోగుల క్రమబద్ధీకరణ,పెన్షనర్ల సమస్యలు, బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) 100 శాతానికి పెంచాలనే కేంద్ర ప్రభుత్వ బిల్లును వ్యతిరేకించడం తదితర అంశాలను చర్చించనున్నామన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 90 మంది ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చార్మినార్: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సౌత్ జోన్ డీసీపీ స్నేహా మెహ్రా సూచించారు. దక్షిణ మండలం పోలీసులు, శాంతి సంఘం సభ్యులతో సంజరి ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా శాంతి సంఘం సభ్యులు స్థానిక పోలీసులతో సమన్వయంగా ఉంటూ అన్ని ఉత్సవాలకు తమ సహకారాన్ని అందజేస్తున్నారన్నారు. అందరి సహాయ సహకారాలతో ఈ పండుగల సీజన్ను కూడా శాంతియుతంగా పూర్తి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం పండుగల సీజన్ కేలండర్ ను విడుదల చేశారు. కార్యక్రమంలో దక్షిణ మండలం డీసీపీ మహమ్మద్ మజీద్, మీర్చౌక్ ఏసీపీ వెంకటేశ్వర రావు, చార్మినార్ ఏసీపీ పి.చంద్రశేఖర్, ఫలక్నుమా ఏసీపీ ఎంఏ జావిద్, ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, సౌత్ జోన్, సెంట్రల్ జోన్ పీస్ కమిటీ సభ్యులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయండి


నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: వాటర్ బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, వాటర్‌బోర్డు జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ కోరారు. ఈమేరకు నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన ఏఎంఎస్ విధానం ద్వారా వేలాది మంది కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతున్నారన్నారు. పదేళ్ల క్రితం వాటర్‌బోర్డులో ఉన్న ఓపెన్ టెండర్ సిస్టంను అమలు చేయాలని కోరామన్నారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని వాటర్‌బోర్డు ఎండీతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీనిచ్చినట్లు ఆయన తెలిపారు.

దశలవారీగా అభివృద్ధి పనులు


టోలిచౌకీలో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ తదితర డివిజన్లలోని గోల్కొండ, నదీమ్ కాలనీల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల కోసం చేపట్టిన తవ్వకాలతో ఇబ్బందులు పడుతున్నామని త్వరగా పూర్తయ్యేలా చూడాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. నదీమ్‌కాలనీకి వరద ముప్పును శాశ్వతంగా తప్పించేందుకు పనులు కొనసాగుతున్నాయని, సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అనంతరం టోలిచౌకీ-టూమ్స్ రోడ్డు, టోలిచౌకీ చౌరస్తా వద్ద పైపులైన్ పనులను పరిశీలించారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరలోనే బల్దియా కమిషనర్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తానని పేర్కొన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

యాంత్రిక జీవితంలో తగ్గిన కళాభిరుచి



సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఉరుకుల పరుగుల యాంత్రిక జీవితంలో కళాభిరుచి తగ్గిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి పేర్కొన్నారు. రవీంద్రభారతిలో శ్రద్ధా ఫైనార్ట్స్ అకాడమీ ఆవిర్భావ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. సమాజంలో ఎన్ని సాంస్కృతిక సంస్థలు వచ్చినా అవి సమాజానికి మేలు చేస్తాయన్నారు. అనంతరం పద్మశ్రీ డాక్టర్ వేలు ఆనందచారితో పాటు పలువురు కళాకారులను సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సినీ నేపథ్య గాయకులు కృష్ణ చైతన్య, ఆదిత్య అయ్యంగర్, సాహిత్యకారులు చింతపట్ల సుదర్శనచార్యులు, సంస్థ వ్యవస్థాపకురాలు సంజన భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గణన పేరిట మోసం


విముక్తి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎర్ర సత్యనారాయణ

సుల్తాన్‌బజార్: కులగణన చేపట్టి తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవనంలో తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాండు యాదవ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదిక సీనియర్ నాయకుడు అక్కల బాబు గౌడ్ రచించిన 'విముక్తి' అనే రాజకీయ కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల జనాభాను మోసపూరితంగా 54 నుంచి 46 శాతానికి తగ్గించి 6.5 శాతం ఉన్న వారి జనాభాను 16 శాతం పెంచేందుకు చర్యలు తీసుకుని గతంలో జరిగిన మోసాల కంటే బీసీలపై కొత్తరకం మోసానికి రేవంత్‌రెడ్డి తెరలేపారన్నారు. ప్రభుత్వ, పార్టీల మోసాలపై ఈనెల 22న విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే వచ్చేనెల 9న వేదిక సీనియర్ నాయకుడు డాక్టర్ నరహరి ఆధ్వర్యంలో నిర్వహించే జుక్కల్ మహా సభకు ప్రతిఒక్కరూ తరలిరావాలని ఎర్ర సత్యనారాయణ పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నారగోని, నాగుల శ్రీనివాస్ యాదవ్, సంధ్య, కాశీనాథ్, చెన్నయ్య, ఆరేపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాల తనిఖీ


మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ పోమ్యానాయక్

యాకుత్‌పురా: దారుషిఫాలోని ప్రభుత్వ అంధుల ప్రత్యేక పాఠశాలను బుధవారం ఉదయం బహదూర్‌పురా మండల విద్యాశాఖ డిప్యూటీ ఈఓ పోమ్యానాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఆయన వెంట ప్రభుత్వోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఖుద్సియా, మండడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురి రిమాండ్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ స్నేహా మెహ్రా

డబీర్‌పురా: దారి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురిని మీర్‌చౌక్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా అదనపు డీసీపీ మహ్మద్ మాజిద్, మీర్‌చౌక్ ఏసీపీ ఎస్ఎస్ ఎస్‌వీ వెంకటేశ్వర్ రావు, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.దిలీప్ కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఫలక్‌నుమా జహనుమాకు చెందిన సయ్యద్ ఫహద్ అలీ ఆలియాస్ బాస్ (22), మహ్మద్ తౌహీద్ ఉద్దీన్ (22), మొఘల్‌పురాకు చెందిన విద్యార్థి సయ్యద్ రుమాన్ ఉల్లా హుస్సేన్ ఆలియాస్ రుమాన్ (21), సైదాబాద్ కాలనీకి చెందిన మహ్మద్ అబ్దుల్ రవూఫ్ ఆలియాస్ అఫాన్ (22), మొఘల్‌పురా ఆస్రా ఆసుపత్రికి చెందిన మహ్మద్ సోహేబ్ ఖాన్ ఆలియాస్ గుల్లు (20) ముఠాగా ఏర్పడి కత్తితో బెదిరిస్తూ దారి దోపిడీలు చేస్తున్నారు. గత నెల 19న డబీర్‌పురాకు చెందిన వ్యక్తి చార్మినార్ గుర్జానా గల్లీ వద్ద వేచి ఉండగా కత్తితో బెదిరించి రూ.40 వేలు లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మీర్‌చౌక్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను బుధవారం అరెస్ట్ చేసి వారి నుంచి యాక్టివా వాహనం, రెండు సెల్‌ఫోన్లు, ఒక బర్గ్‌మ్యాన్ వాహనం, రూ.18,500 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.